క్లుప్తంగా

నేడు ఆసరా సంబరాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు

కాళ్ల: మండలంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు పార్టీ నాయకులు సోమవారం తెలిపారు. మండలంలో జక్కరం గ్రామంలో మధ్యాహ్నం 3 గంటలకు అసరా సంబరాలు జరగనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరుకానున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో 'విష్ణు' విద్యార్థుల ప్రతిభ



బాస్కెట్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. ఈనెల 1న ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

ఆర్చరీ పోటీల్లో సూర్యహంసినికి కాంస్యం



మాదాల సూర్యహంసిని

సాక్షి, భీమవరం: కేలో ఇండియా కాంపౌండ్ ఉమెన్ నేషనల్ ర్యాంకింగ్ విలువిద్య అండర్-17 సబ్‌జూనియర్ పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన మాదాల సూర్యహంసిని కాంస్య పతకం సాధించింది. హర్యానాలోని సోనిపట్‌లో ఈనెల 2వ తేదీన నిర్వహించిన పోటీల్లో సూర్యహంసిని ఢిల్లీకి చెందిన తనిస్కభాటియాపై విజయం సాధించిందని ఏపీ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ సోమవారం చెప్పారు. క్రీడాకారిణి సూర్యహంసిని సత్యనారాయణ, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు, కోచ్ కమల్‌కిషోర్ తదితరులు అభినందించారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్ ఏర్పాటు



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ డ్వాక్రా సంఘాల ద్వారా నూతన క్యాంటీన్ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్న సందర్భంగా ఈ నూతన క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ వేణుగోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నూతన క్యాంటీన్‌ను డ్వాక్రా సంఘానికి అప్పగించామన్నారు. క్యాంటీన్‌లో టీ, టిఫిన్, భోజనం, డ్వాక్రా సంఘాల ద్వారా తయారవుతున్న స్వీట్లు తదితర అందుబాటులో ఉంటాయన్నారు.

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా సీతారామ్



కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సమావేశమైన వీఆర్వోలు

కాళ్ల: వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా కాళ్లకూరు వీఆర్వో నిట్టల సీతారామ్ ఎన్నికయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ సమక్షంలో సోమవారం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సీతారామ్, ఉపాధ్యక్షుడిగా పెదఅమిరం వీఆర్వో గుర్రం చిట్టిబాబు, కార్యదర్శిగా ఏలూరుపాడు వీఆర్వో కోమటి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా సీసలి వీఆర్వో బి.రాజేశ్, సహ కోశాధికారిగా ప్రాతాళ్లమెరక వీఆర్వో ఎం.ప్రశాంత్ బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికైన నూతన కమిటీని పలు గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు



మోగల్లులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



గుట్లపాడులో పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థినులు



కాళ్ల కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖాధికారి బి.వినాయకుడు తెలిపారు. మండలంలో గూట్లపాడు, దిరుసుమర్రు, అనాకోడేరు, తుందుర్రు, చినఅమిరం గ్రామాలలో జిల్లా పరిషత్ హై స్కూల్స్ పరీక్షా కేంద్రాల పరిధిలో మొత్తం 712 పదో తరగతి విద్యార్థులు పరీక్షా రాయాల్సి ఉండగా తెలుగు పరీక్షకు 706 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.

వీరవాసరంలో 847 మంది హాజరు

వీరవాసరం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని మండల విద్యాశాఖ అధికారి బొక్కా వినాయకుడు సోమవారం తెలిపారు. వీరవాసరం మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 868 మంది విద్యార్థులకు గాను 847 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

కాళ్లలో 8 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కాళ్ల హైస్కూల్లో 210కి గాను ఇద్దరు, కోపల్లెలో 194కి గాను ఇద్దరు, కలవపూడిలో 98కి గాను ముగ్గురు, ఏలూరుపాడు జడ్పీ హైస్కూల్లో 180 మందికి గాను ఒక విద్యార్థి చొప్పున మొత్తం 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర చెప్పారు. మండలంలో మొత్తం 682 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 674 మంది తొలి రోజు పరీక్ష రాసినట్లు వివరించారు. కాళ్లలో పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ టీఏ కృష్ణారావు పరిశీలించారు.

ఉండిలో తొలిరోజు 14 మంది గైర్హాజరు

ఉండి: సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మండల వ్యాప్తంగా 14 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, యండగండి, ఉప్పులూరు గ్రామాల్లోని పరీక్షా కేంద్రాల్లో మొత్తం 661 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 647 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పరీక్ష ముగిసిందని అధికారులు తెలిపారు.

పాలకోడేరులో 13 మంది గైర్హాజరు

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు, పాలకోడేరు, శృంగవృక్షం, విస్సాకోడేరు, మోగల్లు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు మొత్తం 664 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 651 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ పి రామలక్ష్మణమూర్తి తెలిపారు. 13 మంది విద్యార్థులు హాజరు కాలేదన్నారు.

స్పందనలో రెండు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చాయని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకర్ సోమవారం చెప్పారు. దుంపగడప గ్రామంలో అనుమతులు లేని రొయ్యల చెరువుకు విద్యుత్ కనెక్షన్ ఏ విధంగా మంజూరు చేశారని, కనెక్షన్ నిలుపుదల చేయాలని సూరంపూడి వెంకట రాంబాబు, అద్దేపల్లి ప్రభాకర్ ఫిర్యాదు చేశారని చెప్పారు. కుప్పనపూడి గ్రామంలో తన సొంత స్థలంలో ఇతర వ్యక్తులు కలగజేసుకుని అబద్ధపు సాక్ష్యాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామానికి చెందిన రాటాల ఉమా ఫిర్యాదు చేశారని చెప్పారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీకి చర్యలు

ఆకివీడు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాయి ట్రస్ట్ ఒడిశా ఆధ్వర్యంలో గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు సంస్థ కో-ఆర్డినేటర్ పువ్వాడ రాజా అమర్నాథ్ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా పౌష్టికాహార కిట్లను అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మండలాల్లో కో-ఆర్డినేటర్లు, గ్రామాలలో వలంటీర్లను నియమించామన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బడుగుల సంక్షేమం



వీరవాసరం సమావేశంలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమేనని పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం అన్నారు. వీరవాసరం తులసి కన్వెన్షన్ సెంటర్లో సోమవారం నిర్వహించిన గృహ సారథులు, కన్వీనర్లు, ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న, అందజేస్తున్న పథకాలను ఇంటింటికీ తిరిగి వారు అందుకున్న లబ్ధిని మరొకసారి గుర్తు చేస్తూ కాసేపు ఆ కుటుంబాల వారితో గడపాలని సూచించారు. గృహ సారథులు, కన్వీనర్లు సైనికుల్లా పనిచేస్తూ పార్టీ పురోభివృద్ధికి కృషి చేయాలని వివరించారు. అనంతరం కిట్లను పంపిణీ చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వ్యవసాయ సలహా మండల చైర్మన్ గొలగాని సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు నూకల కనకారావు, మాజీ జెడ్పీటీసీ పోలిశెట్టి సత్యనారాయణ, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, చావాకుల సత్యనారాయణమూర్తి, చికెలే మంగతాయారు, గద్దం భారతి, వేగేశ్న వర్మరాజు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, నల్లమల్లి వేణుక, కోడె వరలక్ష్మి, దాసరి మహాలక్ష్మి, మేకల వెంకట చలపతి, వీరవల్లి శ్రీనివాసరావు, బోను జోష్ణ దేవి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలి



చినమిల్లిపాడులో కార్యక్రమంలో పాల్గొన్న పుప్పాల పండు

ఆకివీడు: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న రోజుల్లో కూడా ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి మద్దతు పలికారు. మండలంలోని చిన్నమిల్లిపాడు గ్రామంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. జేసీఏ ఇన్‌చార్జి పుప్పాల పండు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పథకాలు ప్రగతికి దోహదపడుతున్నాయని ప్రజలే చెబుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నాడు-నేడు అభివృద్ధి పనులు ప్రజల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ గురుదాస్ సీత బాలాజీ, పలువురు వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

విస్సాకోడేరు సర్పంచ్‌కు సత్కారం



గ్రామ సర్పంచ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: విస్సాకోడేరు గ్రామంలో గత రెండేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై గ్రామస్తులు, స్థానిక నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లం శ్రీనివాస్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో గడిచిన రెండేళ్ల కాలంలో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామంలో రెండు కిలో మీటర్ల మేర సిమెంట్ రహదారులు, మూడు కిలో మీటర్ల మేర గ్రావెల్ రహదారులు నిర్మించామన్నారు. అలాగే సచివాలయ భవనాలు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మాణం పూర్తయిందన్నారు. గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం జిల్లా శిక్షణ కేంద్రంగా ఎంపికైందన్నారు. ఎంపీటీసీ సభ్యులు బొల్లం గాంధీ, పెదపూడి లక్ష్మీపతి, స్వర్ణలత, వార్డు సభ్యులు నాగరాజు బాలాజీ, అంజి చందు పాల్గొన్నారు.

శ్రీరామ నామస్మరణతో మార్మోగిన బొండాడ



రథంపై ఊరేగుతున్న సీతారాముల వారు



బొండాడలో సీతారాముల ఊరేగింపులో వేషధారణలు

కాళ్ల: శ్రీరామ నామస్మరణతో బొండాడ గ్రామం మార్మోగింది. గ్రామంలో భద్రాద్రి శ్రీరామచంద్ర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లను వివిధ మేళతాళాలతో, చిత్ర విచిత్ర వేషధారణతో, బాణసంచా కాల్పుల నడుమ భక్తిశ్రద్ధలతో భారీ ఊరేగింపు కన్నుల పండుగగా జరిగింది. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు రోడ్లపై బారులు తీరారు. వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రామం కుటుంబానికి కరాటం పరామర్శ

ఉండి: పెదపుల్లేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కలిదిండి రామచంద్రరాజు (పెదపుల్లేరు రామం) ఈ నెల 1వ తేదీన మృతి చెందగా, కుటుంబ సభ్యులను సోమవారం డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పరామర్శించారు. తొలుత రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారుడు కలిదిండి శివరామకృష్ణనారాయణ వర్మను ఓదార్చి ధైర్యం చెప్పారు.

108 బిందెలతో మావూరమ్మకు అభిషేకం



బిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బంగారు వారి చెరువుగట్టున కొలువై ఉన్న శ్రీ మావూరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ముందుగా అమ్మవారికి 108 బిందెలతో అభిషేకం చేశారు. సోమవారం స్థానిక మహిళలు 108 పసుపు, కుంకుమ, గంధం, నీళ్ల బిందెలతో వార్డులో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు తెలిపారు. ఈ జాతర మహోత్సవాలు ఐదు రోజులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకరాపు శ్రీనివాసు, యందం శ్రీను, రౌతు అచ్యుతరావు, గమిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మణేశ్వరంలో వైఎస్సార్ ఆసరా

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో మంగళవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం పద్మ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి లక్ష్మణేశ్వరం-2 సచివాలయం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టివారిపాలెం, రుస్తుంబాద, సీతారామపురంసౌత్, నార్త్, రాజుగారితోట గ్రామాలకు చెందిన డ్రాక్వా సంఘాలకు ఆసరా చెక్కులను పంపిణీ చేస్తారన్నారు.

నేడు ఆచంట, ఆచంట వేమవరంలలో..

పెనుగొండ: ఆచంట మండలంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి చెప్పారు. విలేకర్లతో మాట్లాడుతూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆచంటలోని రామేశ్వరస్వామి సత్రంలో వల్లూరు, భీమలాపురం, అయోధ్యలంక, కరుగోరుమిల్లి, కందరవల్లి గ్రామాలకు చెందిన మహిళలకు, 11 గంటలకు ఆచంట వేమవరంలో ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాలకు చెందిన మహిళలకు నిర్వహిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రబీ మాసూళ్లు ప్రారంభం



శివదేవుని చిక్కాలలో దాళ్వా పంటను యంత్రం ద్వారా మాసూలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలో దాళ్వా పంట మాసూళ్లు ప్రారంభమయ్యాయి. నీటిపారుదల శాఖ అధికారులు వంతుల వారీ విధానం అమలు చేయడతో సాగునీటి ఎద్దడి సమస్య తలెత్తలేదు. ముందస్తు సాగు ఏర్పాట్లు చేసుకున్న రైతులు కొన్ని ప్రాంతాల్లో కోతలు ప్రారంభించారు. మండలంలోని శివదేవునిచిక్కాల, తిల్లపూడి, వెంకటాపురం, అరట్లకట్ట, పాలమూరు, గవరపేట తదితర గ్రామాల్లో మాసూళ్లు ప్రారంభించారు. వరికోత యంత్రం ద్వారా మాసూళ్లు చేసుకోవడంతో ట్రాక్టర్ల ద్వారా ధాన్యం వెంటనే గట్టుమీదకు చేరుస్తున్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 11,164 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేశారని ఏవో షేక్ అబ్దుల్ రహీం తెలిపారు.

గుమ్మలూరులో ఛత్రపతి శివాజీ వర్ధంతి



పాఠశాలలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్

పోడూరు: గుమ్మలూరు మెయిన్ పాఠశాలలో సోమవారం ఛత్రపతి శివాజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులతో కలసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. దేశభక్తికి, దైవభక్తికి, ధైర్యానికి శివాజీ మారుపేరనీ, మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ మైలే శాంతకుమారి, పీఎంసీ సభ్యులు రావి పాటి మాణిక్యం, కొర్ర మణిదీపిక, పెనుగొండ భూలక్ష్మి, కంతేటి నాగమణి, కట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో అపార అవకాశాలు

సాక్షి, భీమవరం: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఫార్మా రంగాల్లో విద్యార్థులకు అపార అవకాశాలున్నాయని కేఆర్ కన్సల్టెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కేఆర్ ప్రసాద్ అన్నారు. భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాలలో 'రోల్ అఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. నాందేడ్ ఇందిరా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కటకం ప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఫార్మా రంగంలో రాబోయే మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో విష్ణు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ నటరాజ్, డాక్టర్ కృష్ణ, విష్ణు క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

వాతావరణం మార్పుతో రైతుల్లో గుబులు



మొగల్తూరులో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న కూలీలు



మొగల్తూరులో కోతకు సిద్ధమైన వరి పంట

మొగల్తూరు: వాతావరణం మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది, ఇరవై రోజుల్లో పంటచేతి కొచ్చే దశలో తరుచూ వాతావరణంలో మార్పులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని మొగల్తూరు, నవుదూరు గరువు, కేపీపాలెం, పేరుపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో సుమారు 1,197 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. సాగు పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో పంట చేతికిరావడం కూడా మరో ఇరవై రోజులు సమయం పట్టనుంది. మండలంలో ఎక్కువ శాతం రైతులు 130 రోజులకు పంట చేతికొచ్చే 1,153 రకం విత్తనాలు వినియోగించగా మరికొంత మంది రైతులు 140 రోజులకు పంట చేతికొచ్చే 1,121 రకం విత్తనాలను వినియోగించారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు, ఈదురుగాలులకు ఈనిక దశలో ఉన్న చేలు నేల రాలగా ఆందోళనకు గురయ్యారు. పంట చేతికొస్తుందని ఊపిరిపోసుకుంటున్న దశలో మరోసారి గత మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు మామిడి రైతుల పరిస్థితి కూడా ఆయోమయంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి చేతికొచ్చే రకం కాయలు దిగుబడి లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం లేదా ఈదురుగాలులు వీచినా ఉన్న కాయలు కూడా నేలరాలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

యలమంచిలి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కల తీరుతుందని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి అన్నారు. మేడపాడులో ఇద్దరు లబ్ధిదారులకు ఇంటి స్థలం మంజూరు కాగా, వారికి ఇళ్ల పట్టాలను సోమవారం ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభతో కలసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలో సుమారు రెండెకరాల స్థలం కొనుగోలు చేసి 80 మందికి ఇళ్ల స్థలాలిచ్చామన్నారు. ఇంకా అర్హులుంటే వారికి కూడా పట్టాలిస్తామని చెప్పారు. ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు డేగల వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, వీఆర్వో తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 22 మంది ఎంపిక

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బాలనాగమణి సోమవారం చెప్పారు. జిల్లా స్థాయిలో కె.కార్తీక్ ప్రథమ స్థానం, బి.సత్యచంద్ర శేఖర్ ద్వితీయ స్థానం, సీహెచ్ జిజ్ఞాస్ మూడో ర్యాంక్, టి.రాజేశ్వరి 7వ ర్యాంక్, ఆర్.లక్ష్మీ ప్రసన్న 8వ ర్యాంక్ సాధించారన్నారు. గత 11 ఏళ్లుగా సుమారు 159 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ కొపనాతి పల్లయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ కొల్లాటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని స్వామి, రేవు రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.